
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
మంగళవారం 16 జూలై 2024





మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జేసీ మౌర్య



చెత్తాచెదారంతో నిండి ఉన్న నీటి ట్యాంకు

సుంకేశ్వరిలో అతిసార

మంత్రాలయం, జూలై 15: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార విజృంభించింది. తాగునీరు, అపరిశుభ్రత కారణంగా గత నాలుగు రోజుల నుంచి గ్రామ ప్రజలు వాంతులు, విరేచనాలతో ఆదోని, ఎమ్మిగనూరు, రాయచూరు వంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున బోయ ఈరన్న, అంజలి దంపతుల కూతురు జ్యోతి (3) అనే చిన్నారి అతిసారతో మృతి చెందింది. దీంతో అధికారులు అప్రమత్తమై సుంకేశ్వరి గ్రామానికి పరుగులు పెట్టారు. గ్రామ సచివాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇందులో గుడికల్ ముద్దయ్య, తులసి దంపతుల కుమారుడు శివ (2) అనే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామంలో మురికి కాలువలు చెత్తాచెదారంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై మురుగు నీరు చేరడంతో అపరిశుభ్రత నెలకొంది. తాగునీరు పంపింగ్ చేసే బోర్లు కలుషితం కావడంతో అతిసార ప్రబలినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నీటి శాంపుల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన ఆయా శాఖల అధికారులపై ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్యోతి అనే మూడేళ్ల చిన్నారి అతిసారతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. జేసీ, ఆదోని సబ్ కలెక్టర్‌లతో పాటు డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, డీపీవో నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావులు జ్యోతి తల్లిదండ్రులు ఈరన్న, అంజలిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

- మూడేళ్ల బాలిక మృతి
- 70 మందికి అస్వస్థత
- కదిలివచ్చిన అధికార యంత్రాంగం
- 24/7 వైద్యసేవలు అందిస్తామన్న ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

చిన్నారి కుటుంబానికి పరామర్శ

సుంకేశ్వరి గ్రామంలో అతిసారతో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరామర్శించారు. పరిశుభ్రతపై దృష్టి సారించి ఉచితంగా 24/7 ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. పరిస్థితి విషమించే వరకు ఆర్‌డబ్ల్యూఎస్, సర్పంచ్, వైద్యసిబ్బంది ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. వారం రోజులపాటు కంటికి రెప్పల్లా పిల్లలను కాపాడాలని, సచివాలయాన్ని ఏడు రోజులు ఉచిత వైద్యానికి ఉపయోగించుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు 108, 104 వాహనాలను అందుబాటులోకి తెచ్చి విషమంగా ఉన్న ముద్దయ్య, తులసి దంపతుల కుమారుడు శివకు మెరుగైన వైద్యచికిత్సలు అందించారు.

టీడీపీ నాయకుల పరామర్శ

టీడీపీ నాయకుడు ఎస్. రాఘవేంద్రరెడ్డి గ్రామానికి చేరుకుని మృతురాలి తల్లిదండ్రులను పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. అతిసార ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈయన వెంట నాయకులు రోగెప్ప, నాగప్ప, టీడీపీ ఉన్నారు.



సుంకేశ్వరిలో అపరిశుభ్రంగా ఉన్న రోడ్లు



అతిసారతో మృతి చెందిన మూడేళ్ల చిన్నారి జ్యోతి (ఫైల్)

తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ





వైద్య శిబిరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి



చికిత్స పొందుతున్న బాలుడు శివ

సుంకేశ్వరికి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి

మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామానికి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీవో నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలమురళికృష్ణ, డీఎల్‌డీవో నాగరాజరావు, డీఎల్‌పీవో నూర్జహాన్, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, మండల వైద్యాధికారులు గోవిందమ్మ, సురేష్ సోమవారం చేరుకున్నారు. తాగునీటి వ్యవస్థను, మురికి కాలువలను పరిశీలించారు. శ్మశానం దగ్గర వేసిన బోరు నుంచి తాగునీరు సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. మురికి కాలువలను శుభ్రం చేసి, దోమల నివారణకు హైపోద్రావణాన్ని పిచికారి చేయాలని ఆదేశించారు. సచివాలయంలో వైద్యసేవలు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. వీరి వెంట వీఆర్వో ఆనంద్, కార్యదర్శి చిరంజీవి, సర్పంచ్ ముకురన్న, వైద్యసిబ్బంది ఉన్నారు.

బాలిక మృతిపై మంత్రి భరత్ విచారం

కర్నూలు అర్బన్: సుంకేశ్వరి గ్రామంలో అతిసారతో చిన్నారి జ్యోతి మృతిచెందిన సంఘటనపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ విచారం వ్యక్తం చేశారు. అతిసార ప్రబలడంతో ఎందరో అనారోగ్యానికి గురయ్యారని, అలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అతిసార ప్రబలకుండా గ్రామాల్లో బ్లీచింగ్ చేయడంతో పాటు ప్రజలు శుభ్రం పాటించేందుకు అవసరమైన అవగాహన కల్పించాలన్నారు.

ఉన్నా లేనట్టే..!

- జిల్లాలో గాడి తప్పిన పాలన
- పెరిగిన సైబర్ నేరాలతో నిత్యం ఫిర్యాదులే..
- ఉనికి కోల్పోయిన క్రైమ్ పార్టీ, సీసీఎస్
- పోలీసు శాఖలో పెచ్చుమీరిన అవినీతి
- కర్నూలు నగరంలో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య
- కొత్త ఎస్పీ ఎదుట పెను సవాళ్లు

కర్నూలు, జూలై 15:

జిల్లాలో పోలీసు శాఖ గాడి తప్పింది. శాంతిభద్రతల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. పక్క రాష్ట్రాల మద్యం ఏరులైపారుతోంది. సైబర్ క్రైమ్ పెరిగిపోయింది. స్టేషన్లన్నీ సివిల్ పంచాయితీలకు అడ్డాగా మారాయి. ఎంత మంది ఎస్పీలు మారినా నగరంలో ట్రాఫిక్ సమస్య మాత్రం తొలగడం లేదు. క్రైమ్ పార్టీ సిబ్బంది పోలీసులపై రాజకీయ నాయకులు స్వారీ చేస్తున్నారు. సీసీఎస్ పోలీసు వ్యవస్థ ఉందా అనే పరిస్థితి నెలకొంది. ఎస్పీకి కళ్లు, చెవులైన స్పెషల్ బ్రాంచ్‌లోని కొంత మంది సిబ్బంది అవినీతి పెచ్చుమీరిపోయింది. ఇలా ఎన్నో సమస్యలు కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బిందుమాధవ్ ఎదుట ప్రధాన సవాళ్లుగా నిలిచాయి. వీటిని నియంత్రించేందుకు కొత్త ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నిత్యం సైబర్ క్రైమ్ ఫిర్యాదులే

జిల్లాలో సైబర్ క్రైమ్ నేరాలు పెరిగిపోయాయి. కర్నూలు జిల్లాలో ఎక్కువ వెనుకబడిన ప్రాంతాలు పశ్చిమ పల్లెలే. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర నియోజకవర్గాల్లో నిరక్షరాస్యత ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రాంతాల ప్రజలు నిత్యం సైబర్ నేరస్థుల వలలో పడుతున్నారు. ప్రతి వారం స్పందనలో సైబర్ ఫిర్యాదులు వస్తున్నాయి. సైబర్ నేరాలను కనిపెట్టేందుకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు ఉన్నా రికవరీ మాత్రం అంతంతే. రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన ప్రోత్సాహం లేకపోవడం, ఖర్చుతో కూడుకున్న పని కావడంతో పోలీసులు కూడా వెనక్కు తగ్గుతున్నారు. ఉన్నత స్థాయిలో రెకమెండేషన్ ఉంటే తప్ప రికవరీ కావడం లేదు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ బిందు మాధవ్



కర్నూలు, జూలై 15: జిల్లాలో మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఏఆర్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లాకు ఎస్పీగా రావడం సంతోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర డీజీపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడుతామన్నారు. మహిళల భద్రతకు, మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు, సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో నిఘా ఉంచుతామన్నారు. పోలీసులకు జిల్లా ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

- జిల్లా వ్యాప్తంగా మట్కా, పేకాట జోరుగా సాగుతోంది. గతంలో అధికార పార్టీ అండదండలతో మట్కారాయుళ్లు చెలరేగిపోయారు. ఈ మట్కా పల్లెలకు కూడా విస్తరించింది. మొబైల్ పేకాట విచ్చల విడిగా సాగుతోంది. ఆదోని ప్రాంతంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరాలు పట్టుబడినా గత ప్రభుత్వంలో అధికార పార్టీ అండదండలతో పెద్దగా చర్యలు ఏమీ కనిపించలేదు. కర్నూలులో నిత్యం పేకాట, మట్కా జరుగుతున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతా ఆన్‌లైన్ కావడంతో పోలీసులు చేతులెత్తేయాల్సిన పరిస్థితి.
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో నేటికీ ఫ్యాక్షన్ రక్కసి రాజ్యమేలుతోంది. పాణ్యం నియోజకవర్గంలో ఓర్వకల్లు, కోడుమూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలతోపాటు పత్తికొండలాంటి సమస్యాత్మక గ్రామాలపై ఎస్పీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ గ్రామాలపై నిరంతరం నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

కర్నూలు, ఆదోనిలో ట్రా'ఫికర్'

కర్నూలు, ఆదోనిలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆకతాయిలు బైక్ విన్యాసాలు చేస్తూ తోటి వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో అటు ఆర్‌అండ్‌బీ, ఇటు మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవడంలో పోలీసు శాఖ విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా వాటిని ఉపయోగించుకుని ట్రాఫిక్ కంట్రోల్ చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

గత ఐదేళ్లలో దిశా పోలీస్‌స్టేషన్ అంతంత మాత్రంగానే పని చేసింది. అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దిశా పోలీస్‌స్టేషన్ ప్రారంభించినా పని తీరులో పెద్దగా మార్పు కనిపించలేదు. గతంలో ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్ పేరు తీసేసి దిశా పోలీస్‌స్టేషన్‌గా మార్చారు. సమర్థత లేని అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వడం వల్ల ఈ పోలీసుస్టేషన్‌లో అవినీతి పెచ్చుమీరిపోయింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం దిశా పోలీస్‌స్టేషన్ పేరు మార్చి మహిళా పోలీస్‌స్టేషన్‌గానే కొనసాగిస్తోంది.

పోలీసు శాఖలో పెచ్చుమీరిన అవినీతి

జిల్లా పోలీస్ శాఖలో అవినీతి పెరిగిపోయింది. జిల్లా కేంద్రం మొదలుకొని మారుమూల పోలీస్‌స్టేషన్‌ల వరకు పలువురు సీఐలు, ఎస్‌ఐలపై అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రాజకీయ నాయకులకు ముడుపులు సమర్పించి పోస్టింగ్‌లు తెచ్చుకుని అక్రమార్జనకు తెగబడుతున్నారు. మద్యం మామూళ్ల కేసుల్లో లంచాలు మొదలుకొని చోరీ సొత్తు దండుకొని దొంగలను వదిలే స్థాయికి దిగజారుతున్నారు. కొంత మంది పోలీసులు చోరీ కేసుల్లోని రికవరీ సొత్తును అమ్మేస్తున్నారు. గతంలో కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటి ఘటన జరిగింది. అక్కడ పని చేసే సిబ్బంది 105 కేజీల వెండిని రహస్యంగా అమ్మేశారు. ఇక ఫ్యాక్షన్ జోన్ విభాగం, క్రైం పార్టీ, సీసీఎస్ పోలీసు విభాగాలు పూర్తిగా తమ ఉనికినే కోల్పోయాయి. క్రైం



పార్టీ సిబ్బందిని కొంత మంది ఉన్నతాధికారులు తమ సొంత అవసరాలకు వాడుతుండటం వివాదాస్పదంగా మారింది. స్పెషల్ బ్రాంచ్ పని తీరు కూడా మందగించింది. ఈ విభాగంలో జిల్లాలో పని చేసే పలువురు సిబ్బందిపై ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత ఎస్‌ఎస్‌వోలను బెదిరించుకుని తమ పబ్బం గడుపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : జేసీ

కర్నూలు(కలెక్టరేట్), జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఎక్కువ శాతం భూముల సర్వేపై ఉన్నాయన్నారు. డీఆర్వో మధుసూదన్ రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుక్కలను నియంత్రించాలి

- పట్టుకోకుండానే రికార్డులో చూపుతున్నారు
- ప్రస్తుతం ఉన్న ఏజెన్సీని రద్దు చేయాలి
- సర్వసభ్య సమావేశం కార్పొరేటర్లు
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం
- హాజరైన ఎమ్మెల్యేలు గౌరు చరిత, దస్తగిరి
- 15 అజెండాలకు ఆమోదం

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కుక్కల నియంత్రణపై రగడ నడిచింది. మూడేళ్ల కాలంలో ఎన్ని కుక్కలను పట్టుకున్నారో చెప్పాలని అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. కుక్కలను పట్టుకోకుండా రికార్డుల్లో చూపుతున్నారని మండిపడ్డారు. శనివారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మొట్ట మొదటి కౌన్సిల్ సమావేశానికి పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరిలు హాజరయ్యారు. మేయర్ బీవై రామయ్య, కమిషనర్ ఎ.భార్గవతేజలు వారిని సన్మానించారు. అనంతరం సమావేశంలో 15 అజెండాలకు ఆమోదం తెలిపారు. అభివృద్ధి పనులకు నగర పాలక సాధారణ నిధుల నుంచి రూ.9.19 కోట్లు ఖర్చు చేయడానికి పాలకవర్గం పచ్చ జెండా ఊపింది. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో జరిగే పనులకు సంబంధించిన సమాచారం స్థానిక కార్పొరేటర్లకు ఇవ్వాలని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై కార్పొరేటర్ల ఆగ్రహం..

టౌన్ ప్లానింగ్ అధికారులపై కొందరు కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నారని స్వయంగా కార్పొరేటర్‌గా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని క్రాంతికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజుల నిర్లక్ష్యం సమాధానం ఇవ్వడం సబబుకాదన్నారు. 50వ వార్డు రైతుబజార్ వద్ద 127,128 సచివాలయల పక్కనే రోడ్డును ఆక్రమించుకుని కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేశారని, కార్పొరేటర్ షేక్ అహ్మద్, శిల్పాటౌన్‌షిప్‌లో 60 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురైందని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. 17వ వార్డులో రెండేళ్ల క్రితం థీమ్ పార్కు పనులు ప్రారంభించారని, ఎప్పుడు పూర్తి చేస్తారని టీడీపీ కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 21వ వార్డులో వీధి దీపాలు వేయించాలని ఎన్ని సార్లు అడిగినా స్పందించడం లేదని కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి అన్నారు.

వార్డుల్లో ప్రారంభించిన పనుల్లో కాలయాపన చేస్తున్నారని 39,40 వార్డుల కార్పొరేటర్లు సాంబశివ, విక్రమసింహారెడ్డి మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. కొండారెడ్డినగర్, మమతానగర్‌లో లక్ష్మీపురం పార్కు, టాయిలెట్లు నిర్మాణం ఇంకా పూర్తికాలేదని కార్పొరేటర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకులు అరుణ, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ నాగరాజు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి,ఈఈలు శేషసాయి, షాకీర్ హుసేన్, అకౌంట్స్ ఆఫీసర్ చండీప్రసాద్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్, ఇన్‌చార్జి డీసీపీ సంధ్య, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



కుక్కల నియంత్రణపై రగడ...

నగరంలో కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందారని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను పట్టుకోకున్నా పట్టుకున్నట్లు, ఆపరేషన్ చేయకుండా చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారని 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహ్మద్ సమావేశం దృష్టికి తెచ్చారు. కుక్కలను పట్టుకెళ్లే ఏజెన్సీని రద్దు చేసి మరో ఏజెన్సీకి అప్పజెప్పాలని 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ పరమేష్ డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు అంటే అధికారులకు లెక్కలేకుండా పోతోందని 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 52 వార్డులలో మూడేళ్ల కాలంలో ఎన్ని కుక్కలను పట్టుకున్నారు.. ఎన్నింటికి ఆపరేషన్ చేశారు.. వాటి వివరాలు వార్డుల వారీగా ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు.





పారిశుధ్య కార్మికులను పెంచాలి..

కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని మూడు వార్డుల్లో పారిశుధ్య కార్మికులను పెంచాలి. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి. గతంలో ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదు. వీధి కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందారు. పార్కులను కబ్జా చేస్తున్నారు..వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే





కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి..

గత మూడేళ్లలో నగరంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తాం. పాణ్యం 16 వార్డులలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. విస్తరించిన కాలనీలలో రోజు విడిచి రోజు తాగునీరు వస్తోంది. అది కూడా రాత్రిపూట ఇస్తున్నారు. గుంతలు పడిన రోడ్లను పూడ్చడానికి చిప్స్ వేయాలి. 19వ వార్డులోని కొన్ని పార్కులు కబ్జాకు గురయ్యాయి. వాటిని వెంటనే నగర పాలక సంస్థ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. ఇదే వార్డులోని ఇండోర్ స్టేడియం ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం వల్ల వారు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. వెంటనే ఆ వ్యక్తుల టెండరును రద్దు చేయండి. 16 వార్డులలో ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడ కబ్జా చేశారు. ఇన్నాళ్లు ఒక లెక్క..ఇప్పుడు ఇంకో లెక్క..ఎవరైనా కబ్జా చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. హంద్రీనది, కేసీ కెనాల్‌లో ముళ్లకంపలు, గుర్రపు డెక్కాను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



మీ ఇళ్ల వద్ద...మీ కార్యాలయం ఎదుట పడేస్తాం

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు. చెట్ల కొమ్మలు కొట్టి ఎందుకు అక్కడే పడేస్తున్నారు. డంప్ యార్డుకు తరలించకుంటే చర్యలు తీసుకుంటాం. లేని పక్షంలో మీ ఇళ్ల వద్ద...మీ కార్యాలయం ముందు తీసుకువచ్చి పడేస్తాం.

- భార్గవతేజ, కమిషనర్

టీజీ వెంకటేశ్‌ను కలిసిన కేశవరెడ్డి



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేశవరెడ్డి

కర్నూలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి బీజేపీలో చేరి రాజకీయ అరంగ్రేటం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధినేత్రి పురందేశ్వరితో సమావే శమైన సంగతి తెలిసిందే. సోమవారం ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో కేశవరెడ్డి భేటీ అయ్యారు. విద్యా రంగానికే పరిమితం అయిన ఆయన రాజకీయాల్లో అడుగు పెట్టాక టీజీని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బీజేపీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని బీజేపీ నాయకులు కేశవరెడ్డి పేర్కొన్నారు.

భూ తగాదాలే గుండమ్మను బలి తీసుకొన్నాయి

- ఆరుగురు నిందితుల అరెస్టు
- విలేఖరులతో డీఎస్పీ శివ నారాయణ స్వామి
- నాగనాథనహళ్ళిలో కొనసాగుతున్న పికెటింగ్

ఆదోని రూరల్, జూలై 15 : భూ తగాదాల కారణంగానే ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన మాదిగ గుండమ్మను ప్రత్యర్థులు బలి తీసుకున్నారని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం... సర్వే నెం. 500డిలో నాలుగు ఎకరాల స్థలాన్ని గ్రామానికి చెందిన తిరుమలమ్మ వద్ద గుండమ్మ 2019లో కొనుగోలు చేసింది. అయితే ఆ భూమి తమకు కూడ చెందుతుందని తిరుమలమ్మ బంధువు రాఘవరెడ్డి, అతని కొడుకు శ్రీధర్‌రెడ్డి గుండమ్మ వద్ద ఘర్షణ పడుతూ వచ్చారు. ఈనెల 12న శుక్రవారం గుండమ్మ దత్త పుత్రుడు కిశోర్, సహచరుడు పురుషోత్తంరెడ్డితో కలిసి గుండమ్మ పొలానికి వెళ్లింది. అక్కడ జరిగిన ఘర్షణలో రాఘవరెడ్డితోపాటు సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, దాసరి గోవిందు తదితరులు కోపోద్రిక్తులయ్యారు. శ్రీధర్‌రెడ్డి ట్రాక్టర్‌తో గుండమ్మను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సహచరుడు పురుషోత్తంరెడ్డిని సైతం తీవ్రంగా కొట్టారు. నిందితులు ఆరుగురిని శిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద సోమవారం అదుపులో తీసుకొని కోర్టుకు తరలించినట్లు డిఎస్పీ తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో సీఐలు నీరంజన్‌రెడ్డి, గోపి, ఎస్.ఐ శ్రీనివాసులు, పీరయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఈ నెల 12న జీవో నెం.82ను జారీ చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు హెల్త్ స్కీం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రతిసారి రూ.2లక్షల వైద్యసేవలు అందుతాయని అన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. www.cfms.ap.gov.int వెబ్‌సైట్ ద్వారా రూ.1250లు చెల్లించి వచ్చే సంవత్సరం మార్చి 31వరకు హెడ్‌ఆఫ్ అకౌంటు 8342-00-120-01-03-001-001 పద్దుకు డీడీవో కోడ్-2703-0802-003 ద్వారా లబ్ధి పొందాలన్నారు.

జత చేయాల్సిన కాపీలు: ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీం దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కర్నూలు కార్యాలయంలో అందజేయాలి.

వీడని మిస్టరీ

తొమ్మిది రోజులైనా లభ్యంకాని వాసంతి ఆచూకీ



ముచ్చుమర్రిలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర మహిళ సంఘం జనరల్ సెక్రటరీ

పగిడ్యాల, జూలై 15: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. బాలిక కోసం పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. తొమ్మిది రోజులు కావస్తున్నా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడం, అనుమానితులు పొంతనలేని సమాచారం ఇస్తుండటంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం గాలింపు చర్యలకు ఆటకంగా మారింది. దీంతో పోలీస్‌లు స్టేషన్‌కే పరిమితం కావల్సిన పరిస్థితి నెలకొంది. తొమ్మిది రోజులైన తమ బిడ్డ ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తల్లిదండ్రుల రోదనలు మిన్నట్టాయి.

వాసంతి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం

రాష్ట్ర హోంమంత్రి ప్రకటన

నందికొట్కూరు, జూలై 15: తొమ్మిది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత అమరావతిలో ప్రకటించారు. ఈ నెల 7వ తేదీన పార్కులో ఆడుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయిన సంగెం వాసంతి(9)ని కనిపించకుండా పోయిందని ఆమె తెలిపారు. చిన్నారిని అతి క్రూరంగా గొంతు నులిపి చంపి బండరాయి కట్టి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంలో పడేశారని ప్రాథమిక విచారణలో తేలిందని ఆమె అన్నారు. అయితే బుధవారం హోంశాఖ మంత్రి అనిత ముచ్చుమర్రి గ్రామానికి రానున్నట్లు తెలుస్తోంది. వాసంతి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బాలిక కుటుంబానికి పరామర్శ...

వాసంతి కుటుంబ సభ్యులను సోమవారం వైసీపీ మహిళా సంఘం జనరల్ సెక్రటరీ శశికళ, లీగల్ అడ్వైజర్ శ్రీదేవి తదితరులు పరామర్శించారు. బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకులు అందజేసిన రెవెన్యూ అధికారులు

వాసంతి కుటుంబానికి డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్ నిత్యావసర సరుకులు అందజేశారు. బాలిక తల్లిదండ్రులకు 50 కేజీల బియ్యం, చక్కెర, బ్యాళ్లు అందజేశారు. అనంతరం బాలిక కుటుంబాన్ని ఎంఈవో సుభాన్, మురళీమోహన్‌రెడ్డిలు పరామర్శించారు. వాసంతి అక్క జ్యోతిని పగిడ్యాల కస్తూర్బాగాంధీ, తమ్ముడు మహేష్‌ను గురుకుల పాఠశాలలో చేర్పించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించి చదివించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మత్స్యకారులకు శుభవార్త

జీవో నెం.144, 217 రద్దు చేసిన ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 15: మత్స్యకారులకు శరాఘాతంగా మారిన 144, 217 జీవోలను తెలుగుదేశం ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీపై డీజిల్ అందించే పథకాన్ని కూడా తిరిగి పునఃప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10 కోట్లు మంజూరు చేయడంపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెరువుల్లో చేపల వేటను సాగిస్తున్న మత్స్యకారుల కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడేలా నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో మత్స్య కార్మికులు ఆ జీవోలను రద్దు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. అయినా గత వైసీపీ ప్రభుత్వం వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ జీవోలను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం తీసుకున్నారు. దీంతో మత్స్యకార్మికుల సంక్షేమ సంఘం రాయలసీమ ప్రతినిధి వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), జూలై 15: జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కోరారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డీఎంహెచ్‌వో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రాలయం నియోజకవర్గం సుంకేశ్వరి గ్రామంలోని ప్రజలు కలుషిత నీరు తాగి అతిసార బారిన పడ్డారని తెలిపా. వీరిలో 25 మంది తీవ్ర అనారోగ్యంతో ఆదోని ఏరియా ఆసుపత్రిలో, మరి కొందరు ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని అన్నారు. వీరిలో మూడేళ్ల చిన్నారి కోలుకోలేక మృతి చెందడం బాధాకరమన్నారు. గ్రామంలో వారం రోజుల నుంచి ప్రజలు అతిసారతో బాధపడుతున్నప్పటికీ ఆరోగ్యశాఖ సరైన తీరులో స్పందించడం లేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్‌వోకు విషయాన్ని వివరించామని తెలిపారు.

సహకార సంఘాలను బలోపేతం చేయండి

సహకార సంఘాల సంక్షేమ సంఘం

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 15: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘాల సంక్షేమ సంఘం యూనియన్ అధ్యక్షుడు రామక్రిష్ణ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలం నుంచి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. దీనికి తోడు బదిలీల ప్రక్రియ చేపట్టి తమ గుప్పిట్లోనే ఉద్యోగులను బంధించేలా నిర్ణయాలు తీసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను విన్నవిస్తామని తెలిపారు.

కారు మబ్బుల గుంపులు

సుంకేసుల జలాశయంపై కమ్ముకున్న మేఘాలు

కర్నూలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల జలాశయం మీద నల్లని మేఘాలు కమ్ముకు న్నాయి. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో జలాశయంపైన కారుమేఘాలు పరదలా కప్పుకున్నాయి. దట్టమైన మేఘాలతో ఆకాశం వర్షించేందుకు సిద్ధంగా కనిపించింది. ఈ అద్భుత దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.



ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి: ఎమ్మెల్యే


మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), జూలై 15: కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న 38,39,40 వార్డులలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికా కుం డా పరిరక్షించాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మున్సిపాలిటీ కమిషనర్ భార్గవతేజను కోరారు. సోమవారం కర్నూలు నగరపాలక సంస్థ కార్యలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంత మంది ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు ఈ మూడు వార్డుల్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని విలువైన ప్రభుత్వ స్థలాలు ఖాళీగా కనిపిస్తే చాలు కబ్జా చేశారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి తగిన నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే దస్తగిరి కోరారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

కర్నూలు, జూలై 15: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అబ్దుల్ రెహిమాన్ (5) కిడ్నాప్ కథ సుఖాంతమైంది. ఆ బాలుడిని కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. నంద్యాలకు చెందిన సుంకన్న, ఆయన భార్య షేక్ అమీనాలు తమ ముగ్గురు కొడుకులు, కూతురుతో కలిసి మద్దూరునగర్‌లోని హనీఫ్ ట్రేడర్స్ దుకాణం ముందు పడుకున్నారు. సుంకన్న పూటుగా మద్యం సేవించడం, భార్య కూడా గాఢ నిద్రలో ఉండటంతో బాలుడు అబ్దుల్ కింద పడటాన్ని గుర్తించలేకపోయారు. అదే మార్గంలో వెళ్తున్న ఆటో డ్రైవర్ మౌలాలి బాలుడు కిందపడడాన్ని గుర్తించి ఆటో ఆపి ఆ బాలున్ని పైకి లేపాడు. తన సోదరికి పిల్లలు లేరనే విషయం గుర్తుకొచ్చి ఈ బాలున్ని తీసుకెళ్లి తన సోదరికి అప్పగిస్తే బాగుంటుందని భావించాడు. ఈ మేరకు ఆ బాలున్ని తన ఆటోలో తీసుకెళ్లిపోయాడు. అయితే ఆయన ఇంటికి తీసుకెళ్లిన తర్వాత మనసులో తను తప్పు చేశానన్న భావన మొదలైంది. దీంతో పాటు గతంలో సోదరి కూడా ఇలాంటి పనులు చేయవద్దని హెచ్చరించడం గుర్తుకు వచ్చింది. దీంతో చేసేదేమీ లేక ఆ బాలున్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని నిర్ణయించుకున్నాడు. ఇంతలో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆ మార్గంలో వెళ్లిన ఆటోలను టాపు నెంబర్ల సాయంతో గుర్తించి వారికి ఫోన్లు చేయడం మొదలు పెట్టారు. ఇదే క్రమంలో మౌలాలికి ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని పిలవడంతో భయాందోళనకు గురైన మౌలాలి సోమవారం ఆ బాలున్ని తీసుకువచ్చి తన తప్పును ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు ఆ బాలున్ని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, జూలై 15: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఓర్వకల్లు గ్రామ సమీపాన గల సుబ్బారెడ్డి డాబా ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో బైక్ వెళ్తున్న ఓర్వకల్లు గ్రామానికి చెందిన మల్లెపోగు మద్దిలేటి (55) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి సోమవార తెలిపారు. ఆదివారం ఉదయం రెడ్డి డాబా వద్ద తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా పుప్పలగుడా గ్రామానికి చెందిన డ్రైవర్ బ్రజేష్ కుమార్ సింహ తన కారును నడుపుతూ అతివేగంగా, బైక్‌పై వెళ్తున్న మల్లెపోగు మద్దిలేటి, జే.ఆనంద్‌లను ఢీకొనడంతో తీవ్రగా యాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మద్దిలేటి మృతి చెందాడు. మృతుడి భార్య మల్లె పోగు సావమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఏపీటీఎఫ్ నిరసన

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 15: జీపీఎస్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరి యానందం సోమవారం తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పీహెచ్‌సీల్లో మాతృ మరణాలపై సమీక్ష

కర్నూలు(హాస్పిటల్), జూలై 15: మార్చి నుంచి జూన్ వరకు దేవనకొండ, కృష్ణగిరి, కోసిగి, రోజా అర్బన్ హెల్త్ సెంటర్-1లో జరిగిన మాతృ మరణాలపై అడిషనల్ డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు గర్భిణిలను గుర్తించి వారికి సరైన సమయంలో సేవలు అందించి తల్లుల మరణాలను తగ్గించవచ్చునన్నారు. సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, సర్వజన వైద్యశాలకు 108 ద్వారా వెంటనే తరలించి చికిత్స అందించాలన్నారు. సమీక్షలో కర్నూలు జీజీహెచ్ గైనకాలజీ విభాగపు సీనియర్ ప్రొఫెసర్ డా.సావిత్రి, డా. రత్నకుమారి, డా. సుప్రియ, డా.వెంకటరమణ, డా. శ్వేతాశాలిని, డా. ప్రియాంక, అనస్థీషియా వైద్యుడు డా.సుధీర్ కుమార్, బ్లడ్ బ్యాంకు డా. షహనాజ్, ఆదోనీ ఎంసీహెచ్ వసంతలక్ష్మి, 108 డిస్ట్రిక్ట్ మేనేజర్, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 15: చిత్తూరు జిల్లా పుత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ఎన్.జాకీర్ హుశేన్ అన్నారు. సోమ వారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ బాలబాలికల ఎంపిక పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి కే.విజయకుమార్, కోశాధికారి అయ్యన్నగౌడు, జాయింట్ సెక్రటరీ ఉమామహేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ మహేంద్ర, పీఈటీలు కళ్యాణి, మాదవి, బాషా, శాంతరాజ్ పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం తేవాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: ఎస్సీ, ఎస్టీ తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.గురు శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పాతబస్తీ సుజిత్ భవన్‌లో నగర అధ్యక్షు రాలు జయమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా నేటికి రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు రజకులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సామాజిక రక్షణ చట్టం తేవాలని కోరారు. ఈ సమావేశంలో పుష్ప, షకీరమ్మ, కమల, శ్రీను, రామదాసు కాంతన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు


నెరవాడలో పీర్లకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కోడుమూరు(రూరల్), జూలై 15: మండలంలోని వర్కూరులో సోమవారం రాత్రి మొహరం వేడుకల్లో భాగంగా చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. స్థానిక చింతతోట, ముస్లిం కాలనీలో ఉన్న పీర్ల చావిడిల నుంచి పెద్ద తోటయ్య, చిన్న తోటయ్య ఇమాంకాశీం, హసన్, హుశేన్, మౌలాలిస్వామి పీర్ల దేవుళ్లను మేళతాళాల మధ్య ఊరేగించారు. మెయిన్‌బజారు, ఆటో స్టాండ్, ఎమ్మిగనూరు రహదారి మీదుగా దనగిరయ్యస్వామి కట్ట వరకు ఊరేగించి తిరిగి చావిడిలకు చేర్చారు. దారిపొడవునా ప్రజలు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా బుధవారం అన్ని గ్రామాల్లో పీర్లను ఏటికి తరలిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నెరవాడలో పీర్లకు ఎమ్మెల్యే గౌరు చరిత పూజలు

కల్లూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా కల్లూరు మండలం నెరవాడలో పీర్లకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం నెరవాడ టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు మొహర్రం ఉత్సవంలో పాల్గొన్న గౌరు చరితకు నాయకులు, మతపెద్దలు ఘనస్వాగతం పలికారు. గౌరు చరిత మాట్లాడుతూ సోదర భావంతో వేడుకలు జరపుకోవా లని సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీ సులు పటిష్ఠ భద్రత చేపట్టాలన్నారు. నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, నెరవాడ టీడీపీ నాయకుడు జాఫర్, కాతా మోహన్‌రెడ్డి, తిమ్మప్ప, మోహ్మద్‌అలీ, పెద్దపాడు లోకేశ్వరరెడ్డి, చిన్న బీచుపల్లి పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని ఆర్.కానాపురం గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా మౌలాలిస్వామి పీర్లకు భక్తులు పూజలు చేసి ఊరేగించారు. ఈకార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, సర్పంచ్ మునిస్వామి, మన్యం కొండ కృష్ణుడు, నరసింహులు, సుభాన్, దస్తగిరి, ఆలీపీరా, గురుస్వామి పాల్గొన్నారు. అలాగే పెంచికలపాడు, కె.నాగులాపురం, బూడిదపాడు గ్రామా ల్లో పీర్లను ఊరేగించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘ టనలు జరగకుండా గూడూరు, కె.నాగులాపురం పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల, సిబెళగల్ గ్రామాల్లో మొహర్రంలో భాగంగా చిన్న సరిగె త్తు ఘనంగా నిర్వహించారు. మండలంలోని గొల్లలదొడ్డిలో గ్రామ పెద్దలు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు. దూర ప్రాం తాలను వచ్చే భక్తులకు కర్నూలు రెండో డిపోకు చెందిన ఆర్టీసీ అధికారులు గొల్లలదొడ్డి గ్రామానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసిందుకు గ్రామ పెద్దలు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో తిరుమల్‌రెడ్డి, సోమేశ్వరరెడ్డి, అనుమంతు, దూద్‌వలి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, కేతవరం, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, మీదివేముల, ఉప్పలపాడు, గుట్టపాడు, సోమయాజులపల్లె, కొమరోలు, శకునాల, కాల్వ, తదితర గ్రామా ల్లో సోమవారం రాత్రి చిన్న మధ్య సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను అగ్నిగుండం ప్రవేశించారు. భక్తులు పీర్లకు చక్కెర తీర్థప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హుశేనాపురం గ్రామంలో నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, గుట్టపాడులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు.


కోడుమూరు మండలంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


పెంచికలపాడులో..


గుట్టపాడులో పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు

అందుబాటులోకి టీజీవీ మినరల్ వాటర్ ప్లాంట్లు

మంత్రి ఆదేశాల మేరకు మరమ్మతులు పూర్తి

కర్నూలు(హాస్పిటల్), జూలై 15: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న నాలుగు టీజీవీ మినరల్ వాటర్ ప్లాంట్లు రోగులకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశాల మేరకు మినరల్ వాటర్‌ప్లాంటులో నీరు తాగే రోగులకు నీరు అందించాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. గత 28వ తేదీ మంత్రి ఆసుపత్రిలో తనిఖీ నిర్వహించి వృధాగా పడి ఉన్న నాలుగు టీజీవీ మినరల్ వాటర్ ప్లాంట్లను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ సర్జికల్, గైనిక్, బాలాజీ క్యాంటీన్ దగ్గర ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లను మంత్రి మరమ్మతులు చేయించారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్ల నీరును సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు.


టీజీవీ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కార్యక్రమంలో ఆసుపత్రి ఏఆర్ఎంవో వెంకటరమణ, హెల్త్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' అందరికీ వర్తింపజేయాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 15: తల్లికి వందనం పథకాన్ని విద్యార్థులందరికీ వర్తింపజేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రతి విద్యార్థికి రూ.15వేలు తల్లికి వందనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెలవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కోశాధికారి అశోక్, అర్జున్, అనిల్ పాల్గొన్నారు.

21న గురుపౌర్ణమి

ఓర్వకల్లు, జూలై 15: మండలంలోని సోమయాజులపల్లె రహదారిపై వెలసిన శ్రీరామరామేశ్వర షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా స్వామివారికి కాగడా హారతి, మహాభిషేకం, అష్టోత్తరం, గురు పూజ హారతి, సంధ్యాహారతి, పల్లకీసేవ, భజన పోటీలు నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మండలంలోని కాల్వబుగ్గ గ్రామ సమీపంలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శివసాయి గురుజి తెలిపారు. సాయిబాబాకు అభిషేకం, హోమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు


మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చింతా సురేష్‌బాబు

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), జూలై 15: జనసేన పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం సూచించినట్లు పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు తెలిపారు. సోమవారం మంగళ గిరిలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో ఇటీవల ప్రజాప్రతిని ధులుగా ఎన్నికైన వారికి సన్మాన కార్యక్రమం జరిగింది. హాజరైన చింతా సురేష్‌బాబు పౌరసర ఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌లను సత్కారించారు.

కర్నూలు ఎంపీని కలిసిన డీఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), జూలై 15: జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

ఎస్సీ వైద్యులకు పదవులు ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 15: కర్నూలు మెడికల్ కాలేజీలో ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లు, వైద్యులకు పదవులు ఇవ్వాలని కోరుతూ సోమవారం ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. గిరిజన విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, నవ్యాంధ్ర జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధకృష్ణ మాట్లాడారు. టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

దళితులపై దౌర్జన్యాలు ఆపాలి: కేవీపీఎస్

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సమితి అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆనంద్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని అరికట్టడంతో జిల్లా యంత్రాంగం విఫలమైందన్నారు. వెల్దుర్తి మండలం రత్నపల్లిలో జరిగిన సంఘటన మరువకముందే ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామంలో దళిత గుండమ్మను ట్రాక్టర్‌తో గుద్దిచంపడం అన్యాయమన్నారు.

ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం


మేనేజర్ చిన్నరాముడుకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చి ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరిస్తామని నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 ఫిర్యాదులు వచ్చినట్లు మేనేజర్ తెలిపారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీటి పైప్‌లైన్ సమస్య, టిడ్కో ఇంటి కోసం చెల్లించిన నగదు తిరిగి ఇప్పించాలని, ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలనే సమస్యలు వచ్చాయి. టిడ్కో అధికారి పెంచలయ్య, సూపరింటెండెంట్ స్వర్ణలత, ఆర్ఐ సాధిక, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: తహసీల్దార్


తహసీల్దార్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

సి.బెళగల్, జూలై 15: అర్జీలపై వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. సోమవారం సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. గ్రామాల్లోని వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి ఫిర్యాదులను తీసుకుని ఇళ్లకు వెళ్లి విచారణ చేసి రిపోర్టు అందజేయాలని ఆదేశించారు. హౌసింగ్, విద్యుత్ ఏఈలు సుమంత్, సుకుమార్, ఈవోఆర్డీ సందీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీకి పెరుగుతున్న ఆదరణ

కర్నూలు(హాస్పిటల్), జూలై 15: ప్లాస్టిక్ సర్జరీకి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్నదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవ వేడుకలు కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ మంజులాబాయి, వైద్యులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పలు కేసులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా శరీర భాగాలను కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా.సాయిసుధీర్, పద్మ విజయశ్రీ, హరిచరణ్, రేణుకాదేవి, ప్లాస్టిక్ సర్జన్లు విజయ్ చంద్రమౌళి, రాజారవి, వైద్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కల్లూరు, జూలై 15: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన తడకనపల్లెకు చెందిన ఆరుగురు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు కల్లూరు మండలం ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈమేరకు 12వ తేదీ శుక్రవారం తడకనపల్లె సచివాలయంలో ఉదయం 11.15 గంటల వరకు ఒక్కరు కూడా విధులకు హాజరకాకుండా సమయపాలన పాటించని డిజిటల్ అసి స్టెంట్ సీభారాణి, హెల్త్ అసిస్టెంట్ జాహ్నవి, లేడి పోలీస్ మాధురి, వేల్ఫేర్ అసిస్టెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, ఎనర్జీ అసిస్టెంట్ జాన్సన్ డేవిడ్, సర్వే అసిస్టెంట్ చంద్రుడులకు నోటీసులు అందించామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. సోమవారం ప్రజా సమస్యలు-కార్మిక వర్గం నిర్వహించాల్సిన పాత్ర అనే అంశంపై సీఐటీయూ జిల్లా కమిటీ అధ్వర్యంలో కార్మిక కర్షక భవన్‌లో వర్క్‌షాపు నిర్వహించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు నిత్యం కరెంటు చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, బస్సు, రైలు చార్జీలు పెంచడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాక్రిష్ణ, జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, సీహెచ్ సాయిబాబా, విజయ్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎంపీ


మంత్రి సవితతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), జూలై 15: రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, సవితలను ఎంపీ బస్తిపాటి నాగరాజు కలిశారు. సోమవారం విజయవాడలోని మంత్రుల చాంబర్లలో విడివిడిగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని సమస్యలను మంత్రులకు వివరించారు. లోకేశ్‌కు జిల్లాలో వేదవతి, గుండ్రేవుల, ప్రాజెక్టులు నిర్మించి, సుంకేసుల డ్యామ్‌ను ఆధునీకరించాలని, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను పెంచాలని కోరారు. ఎంపీ వెంట టీడీపీ నాయకులు మాన్విదేవేంద్రప్ప, రామకృష్ణ ఉన్నారు.

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 15: బీ క్యాంపు ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్టాబ్లిషింగ్ ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొని ప్రసంగించినందుకు నీతి అయోగ్ ద్వారా హైదరాబాదులోని తెలంగాణ సాంస్కృతిక భవన్‌లో ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నాగ స్వామి నాయక్‌ను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అశోకా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు.. దూపాడు అశోకా మహిళా ఇంజ నీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.సౌమ్యశ్రీకి అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. జేఎన్‌టీయూ ఈఈఈ విభాగం డాక్టర్ అంకారావు పర్యవేక్షణలో అనలైసిస్ ఆఫ్ వేరియస్ కంట్రోల్ స్టాటజిస్ ఫర్ పవర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంటు ఇన్‌ఏ మైక్రో గ్రిడ్ అనే అంశంలో పరిశోధన చేసినందుకు గానూ సౌమ్యశ్రీకి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ కే.అశోకవర్ధన్ రెడ్డి, సీఈవో హరీష్ కృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్.నవీన్‌లు సౌమ్యశ్రీకి అభినందించారు.

పైలా దాస్‌ను అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 15: బ్రాహ్మణ స్త్రీలను, బ్రాహ్మణ కులస్తులను దూషిస్తూ సోషల్ మీడియాలో వీడియో పెట్టిన పార్వతీపురానికి చెందిన పైలా దాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని నగరంలోని వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు సోమవారం ర్యాలీ, నిరసన ప్రదర్శన చేశారు. నగరంలోని కేసీ కెనాల్ సమీపంలోని వినాయక మందిరం నుంచి వందలాది మందితో ఈ ర్యాలీ ప్రారంభించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహంవద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు టి.ప్రతాపరెడ్డి, సందడి మహేష్, మాళిగి భానుప్రకాశ్, గిరిబాబు పాల్గొన్నారు.

సొసైటీ ఎన్నికల్లో ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ విజయం

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: కర్నూలు డివిజన్ పోస్టల్ ఉద్యోగుల కో ఆపరే టివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ జరిగిన ఎన్నికల్లో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్-ఆల్ ఇండియా, గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ప్యానెల్ అభ్య ర్థులు విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో కౌంటింగ్ అర్ధరాత్రి వరకు జరిగింది. ఈ ప్యానెల్‌కు భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసి యేషన్-ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్యానెల్‌గా అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. కౌంటింగ్ అనంతరం ఎన్నికల అధికారి సీని యర్ ఇన్స్‌పెక్టర్ జి.రామక్రిష్ణయ్య ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ అభ్యర్థుల గెలుపును అధికారికంగా ప్రకటించారు. సొసైటీలో 9 డైరెక్టర్ల పోస్టు కోసం జరిగిన ఎన్నికలకు 32 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 746 ఓటర్లు ఉండగా 536 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీ ఎస్‌యూ అభ్యర్థులకు 396 ఓట్లు రాగా మరో ప్యానెల్ అభ్యర్థులకు 140 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో గెలిచిన ప్యానెల్ అభ్యర్థులు సంబరాలు చేసుకున్నారు.

మక్కా యాత్రను విజయవంతం చేయాలి

కర్నూలు(అర్బన్), జూలై 15: సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్ మక్కా యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలని మాజీ మంత్రి మాజీ మంత్రి శైలజానాథ్, డీసీసీ బాబురావు అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉమ్రాయాత్రకు వెళ్తున్న ఆయన్ను శాలువతో సన్మానించారు.

రేపు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం

కర్నూలు(కల్చరల్), జూలై 15: నగరంలోని స్వామి విద్యాప్రకాశనంద గీత ప్రచార సంఘం ఆధ్వర్యంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సంకల్‌బాగ్‌లో గల గీతా ప్రచార ధామంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

అతిసార బాధితులకు జేసీ పరామర్శ


అతిసార బాధితులను పరామర్శిస్తున్న జేసీ

ఆదోని, జూలై 15: ఆదోని డివిజన్ పరిధిలోని మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధితో ఆదోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పరామర్శించారు. అతిసార వ్యాధి బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. అక్కడ కలుషితమైన నీటి సమస్య పై బాధితులతో మాట్లాడి తెలుసుకున్నారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని, ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే చికిత్సలు పొందవచ్చని సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 15: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీ ఎన్జీవో తాలూకా అధ్యక్షురాలు ఉషారాణి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రషీద్, సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకురాలు లక్ష్మి, ఎస్టీయూ నాయకులు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం తుంగభద్ర దిగువ కాలువ కార్యాలయంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ జీపీఎస్‌ల వల్ల తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లగా పోరాటం చేస్తున్నప్పటికీ రాజకీయ పార్టీలు ఉద్యోగులను మభ్యపెట్టి సీపీఎస్ రద్దు చేస్తామని జీపీఎస్ అంటూ కొత్తగా తెరపైకి తీసుకురావడం అన్యాయం అన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు విజయలక్ష్మి, పూలరాజు ఎల్ఐసీ అసోయేషన్ నాయకుడు ధర్మరాజు ఏపీఎన్జీవో ప్రధాన కార్యదర్శి బజారి, మల్లికార్జున, వీరచంద్ర పాల్గొన్నారు.

పంటసాగు పత్రాలు తప్పని సరి

గోనెగండ్ల, జూలై 15: పంట సాగు పత్రాలను కౌలు రైతులు తప్పని సరిగా తీసుకోవాలని తహసీల్దార్ పార్వతి, ఏవో హేమలత అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూసిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పంట సాగు పత్రాల వల్ల కలిగే లాభాలను వివరించారు. పంట సాగు పత్రం అనేది భూమి యజమానికి సాగు దారుడికి మధ్య ఒప్పంద పత్రం ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులు చాలా వరకు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వాసంతి మృతి కి కారణమైన వారిని వెంటనే శిక్షించాలి

గోనెగండ్ల, జూలై 15: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి(8) బాలికపై ఆత్యాచారం జరిపి హత్య చేసిన మానవ మృగాలను వెంటనే కఠినంగా శిక్షించాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పోతులనాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్లలో ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నాగరాజు వాసంతి మృతికి నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. వాసంతి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా అధ్యక్షుడు పాండు, పూర్ణదినకర్, షాదీక్, రవి, గజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయంలో మాజీ సీఎం ఫొటోలు

● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, జూలై 15: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులైనా గ్రామ సచివాలయాల్లో మాజీ సీఎం జగన్ ఫొటోలు, బోర్డులు అలాగే దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని దుద్ది గ్రామ సచివాలయాన్ని సోమవారం టీడీపీ నాయకులు సందర్శించి సచివాలయం పైన మాజీ సీఎం జగన్ ఫొటోతో పాటు సచివాలయం లోపల మా నమ్మకం నువ్వే జగనన్న సంక్షేమ పథకాల బోర్డులు అలాగే ఉంచడంతో సచివాలయ ఉద్యోగుల తీరుపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్ తెలిపారు.

ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందిస్తాం

కోసిగి, జూలై 15: మండలంలోని ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందిస్తామని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. సోమవారం గురురాఘవేంద్ర ప్రాజెక్టు మూగలదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో తుంగభద్రలో నీటి ద్వారా చెరువులోకి నీరు నింపి ఆయకట్టు రైతులందరికీ నీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, గుడిసె రామయ్య, రఘు, మధు తదితరులు ఉన్నారు.

నడకయాతన

చదువుకోవాలంటే పది కిలోమీటర్లు నడవాల్సిందే


మార్లమడికి నుంచి నడుచుకుంటూ హొళగుందకు వెళ్తున్న విద్యార్థులు

హొళగుంద, జూలై 15: ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థులను చూడండి.. చదువుకునేందుకు వీరు ప్రతి రోజూ ఇలా ఒకటి కాదు..రెండు కాదు.. ఏకంగా పది కిలోమీటర్లు నడవాలి. హొళగుంద మండలం మార్లమడికి గ్రామానికి చెందిన వీరంతా బస్సు సౌకర్యం లేకపోవడంతో నిత్యం ఇలా నడకయాతన పడుతున్నారు. గ్రామానికి చెందిన దాదాపు 60 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని విద్యాలయాలకు వెళ్లాలంటే పది కిలోమీటర్లు నడవాల్సిందే. వీరంతా హొళగుందలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో, మరికొందరు కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. మార్లమడికి గ్రామం నుంచి వచ్చే విద్యార్థులకు బస్సుసౌకర్యం కల్పించాలని గ్రామస్థులు రంగప్ప, వీరేష్, హనుమంతు, పరమేష్ సోమవారం తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును కోరారు. "చదువుకోవాలంటే ఇలా నడవాల్సిందే.. రవాణా సౌకర్యం లేకపోవడంతో కొందరు విద్యార్థులు చదువును మధ్యలోనే మానేశారు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదోని డిపో నుంచి విద్యార్థులకోసం విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

దళిత మహిళను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల, జూలై 15: ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ అయిన బసివిని గుండమ్మను అగ్రకులస్థులు ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయడం దారుణమని, హంతకులను కఠినంగ శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్లలో ఆ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అరగంట పాటు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 50లక్షల పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎస్పీ నాగనాథనహళ్లి గ్రామాన్ని సందర్శించి దళితులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని, దాడికి పాల్పడిన అగ్రవర్ణాలకు చెందిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ పార్వతి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేశ్వరావు, మాదన్న, జగన్, పవన్, పెద్దరంగన్న, మహేష్, రంగ, మునిస్వామి, రంగన్న, పాల్గొన్నారు.

పట్టణానికి పూర్వ వైభవం తేవాలి : ఎమ్మెల్యే బీవీ


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూలై 15: ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఎమ్మిగనూరు పట్టణానికి పూర్వవైభవం తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయం, ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశమై చర్చించారు. పట్టణంలో పార్కుల పునరుద్ధరణ, సుందరీకరణ, అంతర్గత రోడ్లు విస్తరణ, వీదిదీపాలు తదితర పనులు వేగవంతంగా చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ నెల 18న పట్టణ శివారులోని మైనార్టీ కాలనీలో 10వేల మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలం కావటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, పట్టణలో ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేయాలని, ప్రజలు అనారోగ్యంపాలు కాకుండా తగిన చర్యలుతీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఇళ్ల నిర్మించుకుంటున్న సామాన్యప్రజలకు వేగంగా ఇంటినిర్మాణాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గంలో ప్రధాన రహదారుల మరమ్మతులకు అవసరమైన చర్యలకోసం ప్రతపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు వరకు ప్రధాన రహదారిని జాతీయ రహదారి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే మంత్రాలయం రోడ్డునుంచి కలుగోట్ల రోడ్డు మీదుగా కర్నూలు రోడ్డు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, ఆర్అండ్‌బీ, సచివాలయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం వేడుకలు

ఆలూరు, జూలై 15: ఆలూరు మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలను సోమవారం కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహిస్తున్నారు... ఆయా గ్రామ చావిడిలలో పీర్ల దేవుళ్ళు కొలువు దీరాయి. మొలగవల్లి గ్రామంలో పీర్ల పండుగ సందర్భంగా జగ్గపులి వేషధారణను గొల్ల జగ్గపులి కర్రెన్న వంశస్థులు గొల్ల రామచంద్ర పులి ఆటఆడుతూ చిన్న మసీదు, డిక్కీ మసీదు, పెద్ద మసీదులనుంచి ప్రతి వీధి తిరుగుతు అందరినీ అకట్టుకున్నాడు. అలాగే పులిని బంధించే మేకలు, నక్కలుగా నలుగురు పప్పు గిత్తలు చేపట్టి పులిని బంధించేందుకు ప్రయత్నం చేస్తారు. పీర్లు వేటకు వెళ్లే వరకు జగ్గపులి ఎటువంటి ఆహారం తీసుకోకుండా ఉంటారు. అలాగే పులి ఆటరోజు పులికి ఎదురుగా ఎవరు చెప్పులు లేకుండా వస్తారు... భక్తులు జగపులికి మేకలు, పోటేళ్లు కానుకగా అందించడం అనాదిగా వస్తున్న ఆచారంగా పాటిస్తున్నారు...

ప్రభలుతున్న అతిసార


ఎమ్మిగనూరులో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు, జూలై 15: గ్రామాల్లో అతిసార మెల్లమెల్లగా ప్రభలుతోంది. ఇప్పటికే మంత్రాలయం మండలం సుంకేశ్వరిలో అతిసారతో ఒకరు మృతిచెందగా పలువురు వ్యాధి బారిన పడి ఆదోని ఆసుత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్ గ్రామానికి చెందిన రామాంజి, నందవరం మండలం కనకవీడుకు చెందిన లక్ష్మి, గోనేగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన రంగమ్మ, ఎమ్మిగనూరు పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన నరసయ్య, మంత్రాలయం మండలం సుంకేశ్వరికి చెందిన నరసప్పలు వ్యాధిబారిన పడి ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఇద్దరు రెండురోజులుగా చికిత్స పొందుతుండగా. ముగ్గురు సోమవారం ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. మెరుగైన చికిత్సలు అందించాలని స్థానిక వైద్యులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శేషారెడ్డి, డాక్టర్ వైత్రేయి, డాక్టర్ బాలజీ ఉన్నారు.

కబ్జా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కబ్జాకు గురైన పార్కు వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్, జూలై 15 : ఆదోనిలోని అమరావతి నగర్‌లోని సర్వే నెం. 181/2, 182, 345లో ఉన్న కోట్లు విలువ చేసే రెండున్నర ఎకరాల ప్రభుత్వ మున్సిపల్ పార్కు స్థలాన్ని వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి కబ్జా చేశారని ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్, రెవిన్యూ అధికారులు స్పందించారు. వెంటనే చర్యలు చేపట్టి అందులో నాటిన రాళ్లను తొలగించారు. సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి ఇతర శాఖల అధికారులు స్థానికులతో కలిసి వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి కబ్జా చేసిన మున్సిపల్ పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంతో విలాసవంతంగా విలువైన రెండున్నర ఎకరాల మున్సిపల్ పార్కు స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిందని, దీంతో చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. నేటి నుంచి ఈ స్థలం మొత్తాన్ని శుభ్రం చేయించి కంచె వేసి స్థానికులు వాకింగ్ చేయడానికి, సేద తీరడానికి, విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి ఉపయోగపడేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారన్నారు. కబ్జాలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

పాఠశాలలో ఎమ్మెల్సీ తనిఖీ


పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

కోసిగి, జూలై 15: జుమాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి వంట ఏజెన్సీ నిర్వాహకులకు సలహాలు సూచనలు చేశారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని, కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. మౌలిక వసతుల విషయంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని, విధులకు సక్రమంగా హాజరై విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ఎమ్మిగనూరు, జూలై 15: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేసించుకొని చదవాలని మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు ఎంఆర్ రమేష్, ఎంఆర్ గంగాధర్, మాచాని సోంనాథ్ అన్నారు. స్థానిక మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న (ఎనిమిది జడ్పీహైస్కూల్స్) 1500మందికి రూ. 17లక్షలు విలువ చేసే స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత పిత పద్మశ్రీ మాచాని సోమప్ప పేదవిద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఆయన ఆశయసాధనలో భాగంగానే పేదవిద్యార్థులు పుస్తకాలు కొనేందుకు ఇబ్బంది పడకుండా ఈ స్టడీమెటీరియల్స్‌ను అందజేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక జడ్పీబాలికల పాఠశాలకు తాగునీటి కొరత తీర్చేందకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రస్టు సభ్యులు తారకేష్, కేఎస్పీ శివన్న, ద్రైవాచారం సుధాకర్, శంకరన్న, మిన్నప్ప, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నీకంఠ, హంపయ్య, నాగభూషణ్ రెడ్డి, రఘు, నటరాజ్,శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 15: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఇచ్చిన గెజిట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఎంటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పురపాలక పాఠశాల వద్ద ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు జంగం బసవరాజు, బసవరాజు, ప్రతాపరెడ్డి, నూరు హుల్ హక్, రమేష్ రావు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో : జీపీఎస్ అమలు ఉత్తర్వులు రద్దు చేసి బేష రతుగా ఓపీఎస్ పునర్ధరణ చేపట్టకపోతే పోరాటాలు తప్పవని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ వీర చంద్రయాధవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమ్ రాజు హెచ్చరించారు. ఉద్యోగుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా అర్ధరాత్రి జీవోలు విడుదల చేయడానికి ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

స్కావెంజర్స్‌ను తొలగించడం అన్యాయం

పత్తికొండ టౌన్, జూలై 15: ప్రభుత్వ పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న స్కావెంజర్స్‌ను అధికార పార్టీని అడ్డం పెట్టుకుని తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, స్కావెంజర్స్ జిల్లా కార్యదర్శి సుంకమ్మ అన్నారు. సోమవారం ఆర్డీవో రామలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. పదిహేను సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో అరకొర జీతాలతో పని చేస్తున్న వారిని బలవంతంగా తొలగిస్తూ అధికార పార్టీ నాయకుల అనుచరులను స్కూల్‌లో ఆయాలుగా చేర్పించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ఈ విధానానికి టీడీపీ నాయకులు స్వస్తి పలకాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కావెంజర్లకు చెల్లించాల్సిన 23 నెలల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు నెట్టికంటయ్య, సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, స్కావెంజర్ల యూనియన్ నాయకులు సిద్ధమ్మ, వెంకటలక్ష్మి, నాగవేణి తదితరులు ఉన్నారు.

ఆలూరు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి


నారా లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవించిన ఆలూరు నేతలు

ఆలూరు, జూలై 15: వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని ఆలూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు మీనాక్షినాయుడు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను, ఆర్థికశాఖ మంత్రి పైయ్యావుల కేశవ్‌ను కలిసి కోరారు. సోమవారం సచివాలయంలో వారిని కలిసి సమస్యలు విన్నవించారు. జింకల పార్కును ఏర్పాటు చేసి, జింకలను నియంత్రించాలన్నారు. ఆలూరు ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారన్నారు. అలాగే డైట్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ కేంద్రంలో బీసీ బాలికల హాస్టల్‌ను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నారా లోకేష్‌ను కలిసిన వారిలో టీడీపీ మండల కన్వీనర్లు అశోక్, టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి, మారుతి, నరసింహులు, ప్రవీణ్, ముత్యాల రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ లక్ష్మయ్య మృతి

కోసిగి, జూలై 15: పెద్దభోంపల్లి ఎంపీటీసీ నాగలదిన్నె లక్ష్మయ్య (జొల్లయ్య) (53) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మండల ఇన్‌చార్జి మురళిరెడ్డి ఎంపీటీసీ లక్ష్మయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లక్ష్మయ్య మృతి వైసీపీకి తీరని లోటని, కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వీధి క్కుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 15: పట్టణంలో వీధి కుక్కల నుండి విద్యార్థులను ప్రజలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీధి కుక్క దాడిలో రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన బాలుడు తీవ్ర గాయాలు పాలై అసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఆ బాలుడికి ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నాయకులు గౌస్, నాగరాజు, శశిధర్, లోకేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించండి

దేవనకొండ,జూలై 15 : మండలంలో కౌలు రైతులను గుర్తించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి ,ఎఓ సురేష్‌బాబు వీఆర్వో, వీఏఏలను ఆదేశాంచారు. కౌలు కార్డు కోసం భూయజమాని పట్టాపాసు పుస్తకం ,ఆధార్, కౌలుదారుని ఆధార్ బ్యాంకు ఖాతా ,రూ.10 ఒప్పందం అగ్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఈ ఏడాది మండలంలో 1270 మంది కౌలు రైతులను గుర్తించాలన్నారు. ఎఈఓ రంగన్న ,జయరాం ,యోగి తదితరులు ఉన్నారు.

జింకల బారినుండి పంటలను కాపాడాలి

దేవనకొండ ,జూలై 15 : జింకల బారినుంచి రైతులు సాగు చేసిన పంటలను కాపాడాలని జనసేన నాయకులు జగదీష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయాల పెట్టుబడులతో పంటలను రైతులు సాగు చేస్తే జింకల వల్ల రైతులు నష్టపోతున్నారని, ఆలూరు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పాటు చేయాలని నంద్యాలకు వచ్చిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కోరామని తెలిపారు. నాయకులు వీరేష్ ,చంటీ ,కృపాకర్ ,ఎ.ఉచ్చీరప్ప,రామాంజినేయులు,రాజు,తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

టీడీపీతోనే వీరశైవ లింగాయత్ అభివృద్ధి

తుగ్గలి, జూలై 15: టీడీపీ గెలుపు కోసం పని చేసిన వీరశైవ లింగాయత్‌లు అధైర్య పడవద్దని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేస్తారని వీరశైవ లింగాయత్ రాష్ట్ర నాయకులు బాదడ కౌశిక్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన 30 రోజులకే రాష్ట్రంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పించన్ల పెంపుతో పాటు ఉచిత ఇసుక, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక వంటి బృహత్తర కార్యక్రమాలు చేపట్టారని, త్వరలోనే అన్ని సామాజిక వర్గాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా కార్పొరేషన్లకు చైర్మన్ డైరెక్టర్ల పదవులు అందించడంతో పాటు నిధులు కూడా అందించి ఆదుకుంటారని పేర్కొన్నారు.

వ్యాయామ టీచర్ల జిల్లా కార్యదర్శిగా చందూ నాయక్

తుగ్గలి, జూలై 15: ఏపీ పీఈటీ జిల్లా యూనియన్ కార్యదర్శిగా తుగ్గలి జిల్లా పరిషత్ హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు చందూ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య, శ్రీనివాసులు సోమవారం జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల యూనియన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా.. తుగ్గలి జడ్పీ పాఠశాలలో పని చేసే చందూ నాయక్‌ను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పీఈటీలు అభినందించి శాలువలతో సన్మానించారు.

వినాయక చవితి ఉత్సవాలను ఐదురోజులకు పెంచాలి

పత్తికొండ టౌన్, జూలై 15: పట్టణంలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను మూడు రోజుల నుంచి ఐదు రోజులకు పెంచాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు వీర్రాజు, ఉత్సవ కమిటి నాయకులు చంద్ర, రామలింగయ్య, లింగమయ్య అధికారులను కోరారు. సోమవారం కర్నూలులో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం అంజదేశారు. ప్రస్తుతం పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పడిందన్నారు. ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాలకు ఐదు రోజులకు పర్మిషన్ ఇవ్వాలన్నారు. అలాగే హోసూరు బైపాస్ హంద్రీనీవా కాలువ దగ్గర, పత్తికొండ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాల్వ దగ్గర వినాయక నిమజ్జనానికి ప్రత్యేక వినాయక ఘాట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

వీరభద్రగౌడుకు సముచిత స్థానం కల్పించాలి

మద్దికెర, జూన్ 15: ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడుకు తెలుగుదేశం పార్టీలో మంచి పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని సౌత్ ఇండియా కాపు అసోసియేసన్ జిల్లా అధ్యక్షుడు, రాయలసీమ ఇన్‌చార్జి వైపీ వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కటారుకొండ మొలగవెల్లి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ వీరభద్రగౌడు ఆలూరు తాలుకాలో టీడీపీ పార్టీ కోసం సేవలు చేశారన్నారు. టీడీపీలో వీరభద్రగౌడు అందరినీ కలుపుకుని వెళ్లలేదని, కొంత మంది ఆరోపిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

మంచి మనిషిని కోల్పోయాం

మద్దికెర, జూన్ 15: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న మంచి మనిషి సీపీఐ మాజీ మండల కార్యదర్శి పాపన్నను కోల్పోవడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పి.రామచంద్రయ్య అన్నారు. సోమవారం మదనంతపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త పాపన్న (48) ఉదయం పొలానికి వెళ్లి వచ్చిన తర్వాత గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తుగ్గలి నాగేంద్ర, సీపీఐ నాయకులు పి.రామచంద్రయ్య, నబీరసూల్, గిడ్డయ్య, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు పాపన్న భౌతిక కాయానికి సీపీఐ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే పాపన్న భౌతికకాయానికి సీపీఐ మండల సహాయ కార్యదర్శి హనుమన్న, సుధాకర్ నివాళి అర్పించారు.

న్యాయం చేయండి

మద్దికెర, జూన్ 15: ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌తో పాటు పొలం అమ్ముకున్న డబ్బుతో జీవనం సాగిస్తుంటే.. తన కొడుకు ఇబ్బంది పెడుతున్నాడని, న్యాయం చేయాలని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన లింగమ్మ అనే వృద్ధురాలు అధికారులను వేడుకుంది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో తహసీల్దార్ రజాక్‌వలిని కలిసి వినతి పత్రం సమర్పించారు. తన భర్త 2015లో మృతిచెందడంతో పెద్దల నుంచి సంక్రమించిన మూడెకరాల పొలాన్ని అమ్ముకున్నానని, వచ్చిన డబ్బుతో ఆరోగ్యం చూపించుకోవడమే కాకుండా జీవనోపాధి కోసం కొంత ఉంచుకున్నానని పేర్కొన్నారు. పెద్దకుమారుడు పొలానికివచ్చిన డబ్బు ఇవ్వాలని వేధిస్తున్నాడని, కొనుగోలు చేసిన వ్యక్తులను కూడా భయపెడుతున్నాడని తెలిపింది. ఎస్ఐ రమేష్‌బాబుతో పాటు తహసీల్దార్‌తనకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేసింది.